# ఖరీఫ్ పెట్టుబడి సాయం సిద్ధం

- 30న రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా సొమ్ము
- ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున జమ
- కొవ్వూరు డివిజన్‌లో 66,345 మంది అన్నదాతలకు లబ్ధి



**కొవ్వూరు:** ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతలకు పెట్టుబడి సాయం అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. తొలివిడత ఆర్థిక సాయాన్ని ఈనెల 30న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 66,345 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రైతు భరోసా ద్వారా ఒక్కో రైతుకు రూ.5,500 చొప్పున రూ.37.12 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. కేంద్రం నుంచి అందే పీఎం కిసాన్ ద్వారా మరో రూ.2 వేలు జమ అయ్యే అవకాశం ఉంది. పీఎం కిసాన్ ద్వారా డివిజన్‌లోని రైతులకు రూ.1,263.92 లక్షల మేర లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఈ సొమ్ముతో కలిపి ఒక్కో రైతుకు తొలి విడతగా రూ.7,500 చొప్పున జమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**ఏటా మూడు విడతలుగా..**

ఏటా జనవరి, సెప్టెంబర్-అక్టోబర్, మే-జూన్ నెలల్లో వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం ప్రభుత్వం మూడు విడతలుగా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభానికి నెల రోజుల ముందుగానే ఈ పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఎరువులు, విత్తనాల కొనుగోలుతో పాటు దుక్కి , కూలీల ఖర్చుల వంటి పనులకు రైతు ఇబ్బందులు పడకుండా నాలుగేళ్లుగా ప్రభుత్వం ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 30న రైతుల ఖాతాల్లో తొలి విడతగా రూ.5,500 పెట్టుబడి సాయాన్ని అందించనుంది. పీఎం కిసాన్ సొమ్ము కుండా తోడైతే ప్రతి రైతుకూ అదనంగా మరో రూ.2 వేలు అందుతాయి.

**అర్హుల జాబితా సిద్ధం చేశాం**



ఈనెల 30న వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా రూ.5,500 చొప్పున రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ముఖ్యమంత్రి బటన్ నెక్కి రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.డివిజన్ పరిధిలో అర్హులైన రైతుల జాబితాలను ఇప్పటికే సిద్ధం చేశాం. పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేల చొప్పున అదే రోజున జమయ్యే అవకాశం ఉంది.

–పి.చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

**నియోజకవర్గాల వారీగా....**
**రైతు భరోసా సాయం ఇలా..**

| మండలం | రైతుల సంఖ్య | సాయం(రూ.లక్షల్లో) |
|---|---|---|
| **గోపాలపురం** | | |
| గోపాలపురం | 8,683 | 486.45 |
| దేవరపల్లి | 8,010 | 451.35 |
| నల్లజర్ల | 10,178 | 568.33 |
| మొత్తం | 26,871 | 15,06.13 |
| **కొవ్వూరు** | | |
| కొవ్వూరు | 6,051 | 339.49 |
| చాగల్లు | 5,909 | 328.78 |
| తాళ్లపూడి | 5,508 | 308.92 |
| మొత్తం | 17,468 | 977.18 |
| **నిడదవోలు** | | |
| నిడదవోలు | 8,892 | 495.66 |
| ఉండ్రాజవరం | 5,705 | 320.86 |
| పెరవలి | 7,409 | 412.14 |
| మొత్తం | 22,006 | 1,228.65 |

## క్లుప్తంగా

### తాగునీటి పథకానికి శంకుస్థాపన నేడు

**ఉండ్రాజవరం:** ఉండ్రాజవరంలో సోమవారం నిర్వహించే పలు అధికారిక కార్యక్రమాల్లో నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొంటారు. జలజీవన్ మిషన్ కింద రూ.5.82 కోట్ల వ్యయంతో చేపట్టబోయే తాగునీటి సరఫరా పథకానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు శంకుస్థాపన చేస్తారని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆదివారం తెలిపారు. అలాగే రూ.కోటి వ్యయంతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలను, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు.

### ఉమాచోడేశ్వరునికి రుద్ర హోమం



ఉమా చోడేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

**కొవ్వూరు:** స్థానిక పాతూరులోని ఉమా చోడేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవార్లకు శ్రీసూక్త విధానంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. పట్టణానికి చెందిన ఏడిద వీర వెంకట సత్యనారాయణమూర్తి, సీతారామమ్మ దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొతవరపు భాను, దేవరకొండ సాయిప్రసాద్ పూజలను పర్యవేక్షించారు.

### కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**నిడదవోలు రూరల్:** మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విజయదుర్గా గ్యాస్ ఏజెన్సీ ఆర్థిక సహాయంతో 100 లీటర్ల పెరుగుతో చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,25,075 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ. బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. పేర్కొన్నారు.

### జనసేన పాదయాత్ర

**కొవ్వూరు:** 'జనసేన శంఖారావం' పేరుతో పట్టణంలోని గోష్పాద క్షేత్రం నుంచి మెరక వీధి వాటర్ ట్యాంకూ వరకు ఆదివారం ఆ పార్టీ శ్రేణులు పాదయాత్ర నిర్వహించాయి. జనసేన పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ బలోపేతంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన చెప్పారు. ఆ పార్టీ నాయకులు ఘంటా కృష్ణ, కళ్లేపల్లి ప్రభాత్, గంద్రోతు పవన్ సోమరాజు, దొడ్డా విజయసారథి, ఆ పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు ఉప్పులూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### జూన్ 10 నుంచి జీడిపప్పు తయారీ నిలుపుదల

**దేవరపల్లి:** మార్కెట్లో జీడిపప్పుకు డిమాండ్ పడిపోయింది. దాంతో జూన్ 10 నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఫ్యాక్టరీలను మూసివేసి, పప్పు తయారీని నిలుపుదల చేస్తున్నట్టు జీడిపప్పు తయారీదారుల సంక్షేమ సంఘం తీర్మానించినట్టు సంఘ కార్యదర్శి కొండపల్లి రమేష్‌బాబు తెలిపారు. దేవరపల్లిలో ఆదివారం జరిగిన జీడిపప్పు తయారీదారుల సంక్షేమ సంఘ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్టు ఆయన తెలిపారు. ఆగస్టు వరకూ ఫ్యాక్టరీలను మూసివేస్తున్నట్టు చెప్పారు. జూన్, జూలై నెలల్లో వివాహ ముహూర్తాలు లేనందున పప్పు వినియోగం ఉండదని, ఇప్పటికే జీడిపప్పు వ్యాపారం సంక్షోభంలో ఉందన్నారు. ఫ్యాక్టరీలను మూసివేయడం వల్ల వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారు. ఈ ప్రాంతంలో ఈ పరిశ్రమై ఆధారపడి దాదాపు 80 వేల మంది జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు.

### అన్న సమారాధన

**చాగల్లు:** హనుమజ్జయంతి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం చాగల్లు మెయిన్ బజార్లోని అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద అన్నసమారాధన నిర్వహించినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు తెలిపారు. చాగల్లు, నెలటూరు గ్రామాల భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారని ఆయన తెలిపారు.

## అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం

- హోం మంత్రి తానేటి వనిత
- మెప్మా ఆధ్వర్యంలో రుతుస్రావ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

**కొవ్వూరు:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తూ, మహిళాభ్యుదయమే లక్ష్యంగా పని చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ప్రపంచ రుతుస్రావ దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బ్రిడ్జిపేటలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ రుతుస్రావం సమయంలో మహిళలు పరిశుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమన్నారు.ఈ విషయమై యుక్త వయసు బాలికలకు తల్లులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే యుక్త వయసు బాలికలకు నాప్ కిన్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలు, యువతుల భద్రత కోసం ప్రభుత్వం దిశ యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ఉద్దేశంతో డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ అక్క చెల్లెమ్మలకు చేయూత, కాపు నేస్తం,ఈబీసీ నేస్తం, మహిళ పేరుతోనే ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇటీవల కొవ్వూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న13 మంది కలిసి అర్థించగా రూ.21 లక్షల తక్షణ సాయాన్ని అందించారన్నారు. అంతేకాకుండా వారి వైద్య సేవలకు భరోసా ఇచ్చారన్నారు. మంత్రిని కలిసేందుకు వచ్చిన గుంటూరు జెడ్పీ చైర్మన్ క్రిస్టియానా మాట్లాడుతూ మహిళా పక్షపాతిగా జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. సీఎంఎం ఏ.జ్యోతి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు పి.ఆదిత్యాయి, కౌన్సిలర్‌లు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, చీరా అరుణ, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ గౌరవాధ్యక్షుడు నగ్గులపాటి శ్రీనివాస్, చీరా రమణ, పతివాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎగుమతులు, కొనుగోళ్లూ లేవు

- మామిడి రైతులు విలవిల
- దెబ్బతీసిన తెగుళ్లు



**నల్లజర్ల:** అకాల వర్షాలు, ప్రతికూల వాతావరణం ఈ ఏడాది మామిడి రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. ఎన్నో ఆశలతో సాగు చేపడితే చివరకు నిరాశే మిగిలింది. మండలంలో దాదాపు 750 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి, జీడిమామిడి తోటలు ఉన్నాయి.కొన్ని తోటల్లో కాపు తక్కువైనా మిగతా తోటల్లో దిగుబడులు ఆశాజకంగానే ఉన్నాయి. అకాల వర్షాలతో మామిడికి మంగు, మసి తెగుళ్లు సోయాయి. దాంతో చెట్లపైనే కాయలు నల్లగా మారాయి. నాణ్యత లేకపోవడంతో కొనుగోలు దారులు ముందుకు రావడం లేదు. ఒక వేళ వచ్చినా తక్కువ ధరకు అడుగుతున్నారు. దింతో గిట్టుబాటు ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

గతంలో మండలంలోని దూబచర్ల, తెలికిచెర్ల ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు మామిడికాయలు ఎగుమతులు అయ్యేవి. ఇప్పుడవి లేకుండా పోయాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచీ మామిడిని తెగుళ్ల చుట్టిముట్టాయి. సస్యరక్షణకు రైతులు భారీగా సొమ్ములు వెచ్చించారు. తొలుత తేనె మంచు పురుగు, బూడిద తెగులు ప్రస్తుతం మసి, మంగు తెగుళ్లు సోకాయి.

గతంలో నాణ్యమైన బంగినపల్లి కాయల రేటు టన్ను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ ఉండేది. గతేడాది అది రూ.24 వేలకు పడిపోయింది. ప్రస్తుతం కాయలు కాస్త బాగుంటే రేటు రూ.7 వేల నుంచి రూ.10 వేలకు మించడం లేదు.

**నాలుగు టన్నులు ఉచితంగా పంచి పెట్టా..**



నేను ఈ ఏడాడి 20 ఎకరాల మామిడి తోటలను కౌలుకు తీసుకొన్నాను. ఈ ఏడాది పెట్టుబడి బాగా పెరిగింది. తెగుళ్ల నివారణకు దఫదఫాలుగా వేలాది రూపాయలు వెచ్చించి మందులు పిచికారీ చేశాను. అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో పేను బంక, మసీ, మంగు, పండు ఈగ తెగుళ్ల సోకడంతో కాయ నాణ్యత తగ్గింది. ప్రస్తుతం ధరలు లేవు. గతంలో వ్యాపారులే తోటల్లోకి వచ్చి మామిడికాయలు కొనుగోలు చేసే వారు. వారు రావడం లేదు. బంగినపల్లి టన్ను రూ.6 వేలకు అడుగుతున్నారు. దీంతో కలత చెంది నాలుగు టన్నుల వరకూ స్థానికులకు పంచి పెట్టా. ఇపుడు ఉచితంగా పట్టుకెళ్ళమన్నా ఎవరూ రావడం లేదు. ఈ సీజన్‌లో రూ.10 లక్షల వరకూ నష్టం రావచ్చు.

– కాసాని బాటయ్య, దూబచర్ల

## నాలుగేళ్ల పాలన విజయవంతంపై నేడు బైక్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత. చిత్రంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ

**కొవ్వూరు:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం సాయంత్రం మండలంలోని ఐ.పంగిడి నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్టు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఐ.పంగిడి నుంచి ఈ ర్యాలీ కాపవరం జంక్షన్, ధర్మవరం, పెనకనమెట్ట, దొమ్మేరు మీదుగా కొవ్వూరు పట్టణంలోకి ప్రవేశిస్తుందన్నారు. స్థానిక మెరక వీధి నుంచి విజయవిహార్ సెంటర్, ఆర్డీవో కార్యాలయం మీదుగా క్యాంపు కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. స్థానిక ముఖ్య నాయకులను టీములుగా విభజించి ర్యాలీ బాధ్యతలు అప్పగించారు. పార్టీ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ మాట్లాడుతూ ఈ వియోజత్సవ ర్యాలీకి పార్టీ శ్రేణులంతా తరలిరావాలన్నారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్య దర్శి ఆత్కూరి దొరయ్య, యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కర రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, ఎంపీపీ జొన్నకూటి పోసిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మలి ప్రయత్నంలో గెలిచేలా..



టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు అనంతపల్లి హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

**నల్లజర్ల:** పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు మలి ప్రయత్నంలో విజయం సాధించేలా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జూన్-2 నుంచి మొదలయ్యే అనుబంధ పరీక్షలకు వీరంతా మరోసారి సిద్ధం అవుతున్నారు. నిర్దేశించిన రోజుల్లో పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులు వచ్చి ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ బోధిస్తున్నారు.గణితం,ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టులకు ఎక్కువ తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది ఇదే తరహా విధానం కొనసాగించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని అనంతపల్లి హైస్కూలు హెచ్ఎం రామారావు తెలిపారు.ఈ ఏడాది మే10 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించినట్టు చెప్పారు. ఉపాధ్యాయులే స్వచ్ఛందంగా వచ్చి పాఠాలు బోధిస్తున్నట్టు తెలిపారు. ఈ నెలాఖరు వరకూ ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. పోతవరం, నల్లజర్ల, దూబచర్ల, ప్రకాశరావుపాలెం తదితర హైస్కూళ్లలో ఇదే తరహాలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

## ఈదురు గాలులు.. అకాల వర్షం

- మామిడి రైతులకు నష్టం
- విద్యుత్తు సరఫరాకు అంతరాయం



తాళ్లపూడి మండలం మలకపల్లిలో రోడ్డుపై విరిగి పడిన కొబ్బరి చెట్టు, విద్యుత్తు స్తంభం

**దేవరపల్లి:** అప్పటి వరకూ భానుడు నిప్పులు చెరిగాడు. ఉన్నట్టుండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పొచ్చింది. కారుమబ్బులు కమ్ముకోవడంతో ఆకాశం మేఘావృతమైంది. వెంటనే ఉరుములు, మెరుపులతో బలమైన ఈదురు గాలులు ప్రారంభమయ్యాయి. చల్లని గాలులకు ఇళ్లల్లోని ప్రజలు రోడ్డుపైకి వచ్చి సేద తీరారు. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పిల్లలు కేరింతలు కొడుతూ వర్షంలో తడుస్తూ రోడ్లపై ఆనందంగా తిరిగారు. సాయంత్రం 4.15 గంటల నుంచి 5.20 గంటల వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు మామిడి, అరటి పంటలకు నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. చెట్లకు ఉన్న నాలుగు మామిడి కాయలు నేలరాలినట్టు రైతులు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం**

**కొవ్వూరు:** ఆదివారం సాయంత్రం కొవ్వూరులో వాతావరణం ఒక్కసారిగా మార్పొచ్చింది. రోహిణీ కార్తె కావడంతో ఉదయం నుంచీ ఎండలు తారెత్తించాయి. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. ఉష్ణతాపంతో జనం అల్లాడిపోయిన తరుణంలో కురిసిన ఈ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేసవి ఎండలు,ఉక్కపోత, వడగాడ్పులతో సతమతం అవుతున్న జనానికి ఈ వర్షం ఊరట కలిగించింది. చాగల్లు, తాళ్లపూడిలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలుల ప్రభావంతో సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. గాలుల ప్రభావంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. అరగంట పాటు ఈదురు గాలులు ప్రభావం చూపించాయి.

**విరిగి పడిన చెట్ల కొమ్మలు**

**గోపాలపురం:** ఆదివారం సాయంత్రం సంభవించిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీ వృక్షాలు విరిగి పడ్డాయి. అరటి, మామిడి తోటల రైతులకు నష్టం వాటిల్లింది. బలంగా ఈదురుగాలుల వీయడంతో గోపాలపురం- కొయ్యలగూడెం రోడ్డుపై భారీ వృక్షాలు విరిగి అడ్డంగా పడ్డాయి. దాంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్టు కొమ్మలు విరిగి కరెంటు స్తంభాలపై పడటంతో సరఫరా నిలిచిపోయింది. గోపాలపురం మండలం దొండపూడి, రాజంపాలెం, కొవ్వూరపాడు గ్రామాల్లోని తోటల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. తాళ్లపూడి- గోపాలపురం రోడ్డులో పెద్దాపురం వద్ద వృక్షాల కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దాంతో మూడు గ్రామాలకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు.వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రోహిణీ కార్తె కావడంతో రెండు రోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడిపోయిన ప్రజలకు ఆదివారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

**నిడదవోలు రూరల్:** ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు మండలంలోని వివిధ గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. సమిశ్రగూడెం, కంసాలిపాలెం, డి.ముప్పవరం గ్రామాల్లో రహదారులపై భారీ వృక్షాల కొమ్మలు పడటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. వివిధ గ్రామాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

**నిడదవోలు:** పట్టణ పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. తాత్కాలికంగా నిర్మించుకున్న రేకుల షెడ్ల రేకులు పైకి ఎగిసి పడ్డాయి. పట్టణ బస్టాండ్ ఏరియాలో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై అడ్డంగా ఉన్నాయి. పట్టణ, పరిసర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై పడ్డాయి. కొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు శాఖ అధికారులు సకాలంలో స్పందించి మూడు గంటల పాటు శ్రమించి పునరుద్ధరించారు.



దేవరపల్లిలో ఈదురు గాలుల ఉధృతి



కంసాలిపాలెం- నిడదవోలు రోడ్డుపై విరిగి పడిన చెట్ల కొమ్మలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



నిడదవోలు కాలువ గట్టుపై నేల నంటిన విద్యుత్తు స్తంభం

### త్యాజంపూడిలో 70 వీధి దీపాల దగ్ధం

**దేవరపల్లి:** ఈదురు గాలులకు త్యాజంపూడి గ్రామంలో 70 వీధిలైట్లు దగ్ధమైనట్టు సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి తెలిపారు. ఫలితంగా ఈ గ్రామంలో అంధకారం నెలకొంది. బలంగా వీచిన గాలులకు రెండు విద్యుత్తు లైన్లు కలవడంతో మంటలు వ్యాపించి వీధిలైట్లు దగ్ధమైనట్టు ఆమె వివరించారు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు చెప్పారు. హెచ్‌టీ లైన్ కింద ఎల్‌టీ లైన్ ఉన్నాయని, గాలులకు రెండు లైన్లు కలిసిపోయి తరచూ వీధిలైట్లు కాలిపోతున్నాయని చెప్పారు. తమ గ్రామంలో మూడు నెలల్లో రెండు సార్లు వీధిలైట్లు దగ్ధమైనట్టు తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ స్వరూపరాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్ అధికారులను కోరారు. వీధిలైట్లు కాలిపోవడం వల్ల గ్రామం అందకారంలో ఉంది.



దేవరపల్లి మండలం త్యాజంపూడిలో కాలిపోయిన వీధి లైటు

### లూథరన్ చర్చిలో శిలువ ప్రతిష్ఠ



కొవ్వూరు లూథరన్ చర్చిలో మంత్రి తానేటి వనితను సన్మానించిన దృశ్యం

**కొవ్వూరు:** పట్టణంలోని మూడో వార్డులోని సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ఏసుక్రీస్తు శిలువను ఆదివారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రతిష్ఠించారు. పాస్టర్ ఉదయ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు మంత్రిని ఘనంగా సత్కరించారు. మంత్రి వనిత మాట్లాడుతూ మానవాళిని పాపుల నుంచి విముక్తులను చేయడానికి ఏసుక్రీస్తు శిలువ ఎక్కాడన్నారు. అటువంటి శిలువను తాను ప్రతిష్ఠించడం ఆనందంగా ఉందన్నారు.

### విద్యుత్తు సరఫరాకు అంతరాయం



బ్రాహ్మణగూడెంలో ఈదురు గాలులు

**చాగల్లు:** మండల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది . బ్రాహ్మణగూడెం కలవలపల్లి ఊనగట్ల, చాగల్లు గ్రామాల్లో 30 విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోవడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి



దేవరపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

**దేవరపల్లి:** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు శత జయంతి వేడుకలను ఆదివారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. దేవరపల్లి బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, కేక్‌లు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. దేవరపల్లి, కురుకూరు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**కొవ్వూరు:** పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు దాయిన రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పశివేదల, తోగుమ్మి, దొమ్మేరు, చిడిపి తదితర గ్రామాల్లోనూ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు అర్పించారు.

**ఉండ్రాజవరం:** ఎన్టీఆర్ విగ్రహాలకు మండలంలోని వేలివెన్నులో టీడీపీ నిడదవోలు నియోకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు, పాలంగిలో తణుకు మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అరుంధతీయ చైతన్య యువజన సంఘం సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**నిడదవోలు రూరల్:** మండలంలోని కోరుమామిడి, పురుషోత్తపల్లి గ్రామాల్లోని ఎన్టీ రామారావు విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు కుందుల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళుర్పించారు.